Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




epaper.telanganaveena.com హైదరాబాద్ శుక్రవారం 14.06.2024

# DYNAMIC

## వయనాడ్‌ను వదులుకోనున్న రాహుల్.. ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ పోటీ..?

తెలంగాణవీణ,జాతీయం



ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పోటీ చేసిన రెండు స్థానాల్లోనూ జయకేతనం ఎగురవేశారు. దీంతో వయనాడ్ (కేరళ), రాయ్‌బరేలీ (యూపీ) స్థానాల్లో ఒక నియోజకవర్గాన్ని ఆయన వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై తాను ఎటూ తేల్చుకోలేకపోతున్నానంటూ ఇటీవల రాహుల్ చెప్పిన సంగతి తెలిసిందే. అయితే, తన నిర్ణయం రెండు వర్గాల ప్రజలను సంతోషపరుస్తుందని అన్నారు. ఈ క్రమంలోనే వయనాడ్ స్థానాన్ని ఆయన వదులుకోనున్నట్లు ప్రచారం జోరందుకొంది. అంతేకాదు.. ఇక్కడి నుంచే ఆయన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా ఎన్నికల అరంగేట్రం చేస్తారనే ప్రచారం జరుగుతోంది.రాహుల్ గాంధీ దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోనప్పటికీ వయనాడ్ స్థానం ఖాళీ కావొచ్చని కేరళ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. సుధాకరన్ ఇటీవల సూచనప్రాయంగా వెల్లడించారు. "ఈ దేశానికి నాయకత్వం వహించాల్సిన రాహుల్ గాంధీ వయనాడ్‌కు మాత్రమే పరిమితం కావాలని మేం అనుకోవట్లేదు. అందుకే ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా బాధపడం. ఆయన నిర్ణయాన్ని అర్థం చేసుకోగలం. ఆయనకు ఎప్పటికీ అండగా ఉంటాం" అంటూ పీసీసీ చీఫ్ వ్యాఖ్యానించారు. దీంతో రాహుల్ ఈ స్థానాన్ని వదులుకుని కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీ ఎంపీగా కొనసాగుతారని ఊహాగానాలు మొదలయ్యాయి.అదే జరిగితే వయనాడ్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమవుతుంది. అప్పుడు ప్రియాంక గాంధీ వాద్రా ఇక్కడి నుంచి పోటీ చేసే అవకాశాలున్నాయి. తన సోదరిని ఆశీర్వదించాలని రాహుల్ వయనాడ్ ప్రజలను కోరనున్నట్లు సమాచారం. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశమున్నట్లు తెలుస్తోంది.ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రియాంక గాంధీ అరంగేట్రంపై గత కొంతకాలంగా ప్రచారం జరుగుతూనే ఉంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు కూడా ఆమె అమేఠీ లేదా రాయ్‌బరేలీ నుంచి పోటీ చేస్తారని వార్తలు వినిపించాయి. దీనిపై సుదీర్ఘ ఉత్కంఠకు తెరదించుతూ రాయ్‌బరేలీ నుంచి రాహుల్ పోటీ చేసి విజయం సాధించారు. సార్వత్రిక ఎన్నికల్లో విస్తృత ప్రచారంపై దృష్టి సారించేందుకే ఆమె పోటీకి దూరమైనట్లు ఇటీవల కాంగ్రెస్ నేతలు చెప్పారు. అయితే, ఎక్కడైనా ఉప ఎన్నిక ద్వారా ఆమె పార్లమెంటుకు వెళ్లవచ్చని అన్నారు. దీంతో వయనాడ్ ఉప ఎన్నిక నుంచే ఆమె పోటీ ఉంటుందని బలంగా వినిపిస్తోంది

## ఏపీ మంత్రులకు శాఖల కేటాయింపు..ఎవరికీ ఏ శాఖా కేటాఇంచారుఅంటే

తెలంగాణవీణ, ఏపీ బ్యూరో

ఏపీలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన విషయం తెలిసిందే. సీఎంగా చంద్రబాబు నాయుడుతో పాటు 24 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అయితే, వీరికి ఏఏ శాఖలు కేటాయిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. తాజాగా ఆ ఉత్కంఠతకు తెరదించుతూ సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులకు శాఖలు కేటాయించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు డిప్యూటీ సీఎంతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు కేటాయించారు. నారా లోకేశ్ కు హెచ్ఆర్డీ, ఐటీ, ఆర్టీజీ శాఖలు కేటాయించారు. మరోవైపు సీఎం చంద్రబాబు నాయుడు వద్ద సాధారణ పరిపాలన, శాంతిభద్రతలు, పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ అండ్ ఇతర మంత్రులకు కేటాయించని శాఖలు ఉన్నాయి.





### మంత్రులకు కేటాయించిన శాఖలు ఇవే..

1. కొణిదెల పవన్ కళ్యాణ్ : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి అండ్ గ్రామీణ నీటి సరఫరా, అటవీ– పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ,
2. నారా లోకేశ్ : ఐటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మానవ వనరుల అభివృద్ధి, ఆర్టీజీ
3. కింజరాపు అచ్చెన్నాయుడు : వ్యవసాయం, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్య
4. కొల్లు రవీంద్ర : గనులు అండ్ భూగర్భం, అబ్కారీ
5. నాదెండ్ల మనోహర్ : ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాలు
6. పొంగూరు నారాయణ : మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి
7. వంగలపూడి అనిత : హోం అండ్ విపత్తు నిర్వహణ
8. సత్యకుమార్ యాదవ్ : ఆరోగ్య, కుటుంబ సంక్షేమం అండ్ వైద్యవిద్య
9. నిమ్మల రామానాయుడు : జల వనరుల అభివృద్ధి
10. ఎన్ఎండీ ఫరూఖ్ : న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమం
11. ఆనం రామనారాయణ రెడ్డి : దేవాదాయ శాఖ
12. పయ్యావుల కేశ్ : ఆర్థికశాఖ, అసెంబ్లీ వ్యవహారాలు
13. అనగాని సత్యప్రసాద్ : రెవెన్యూ, స్టాంపులు అండ్ రిజిస్ట్రేషన్
14. కొలుసు పార్థసారధి : గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాలు
15. డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి: సాంఘిక సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, సచివాలయం అండ్ విలేజ్ వలంటీర్
16. గొట్టిపాటి రవికుమార్: విద్యుత్
17. కందుల దుర్గేశ్ : టూరిజం, సాంస్కృతిక అండ్ సినిమాటోగ్రఫీ
18. గుమ్మడి సంధ్యారాణి : మహిళా అండ్ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమం
19. బీసీ జనార్దన్ రెడ్డి : రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు.
20. టీజీ భరత్: పరిశ్రమలు అండ్ వాణిజ్యం, ఆహారశుద్ది
21. ఎస్.సవిత: బీసీ సంక్షేమం, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్ టైల్స్
22. వాసంశెట్టి సుభాష్ : కార్మిక – కర్మాగార బాయిలర్స్ అండ్ వైద్య బీమా సేవలు
23. కొండపల్లి శ్రీనివాస్: ఎంఎస్ఎంఈ, సెర్ప్
24. మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి: రవాణా శాఖ, యువజన అండ్ క్రీడలు

## కవిత తో ములాఖాత్ అయిన కేటీఆర్

తెలంగాణవీణ, హైదరాబాద్



ఢిల్లీ: మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ తిహాడ్ జైలులో ఉన్న భారాస ఎమ్మెల్సీ కవితతో ఆమె సోదరుడు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ములాఖత్ అయ్యారు. అనంతరం హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. ఢిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ నేరారోపణలతో కవిత అరెస్టయిన విషయం తెలిసిందే. ఈక్రమంలో ఆమెపై సీబీఐ, ఈడీలు వేర్వేరు కేసులు నమోదు చేశాయి.


## మాజీ మంత్రి మల్లారెడ్డిపై కేసు నమోదు..

తెలంగాణవీణ, హైదరాబాద్



మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడికి మరో షాక్ తగిలింది. మల్లారెడ్డిపై పేట్‌బషీర్‌బాద్ పోలీసులు భూకబ్జా కేసు నమోదు చేశారు. మల్లార్ రెడ్డి, ఆయన అల్లుడు రాజశేఖర్ రెడ్డిపై మొత్తం ఏడు సెక్షన్లతో కేసు నమోదు చేసినట్లు సమాచారం. పేట్ బషీర్ బాద్ లో 32 గుంటల భూమి ఆక్రమణకు గుర్తై నిర్మాణాలు కూల్చివేసినట్లు శేరి శ్రీనివాస్ రెడి అనే సాఫ్ట్ వేర్ ఉద్యోగి పేట్ బషీర్ బాద్ పోలీసులను ఆశ్రయించాడు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు మల్లారెడ్డిపై కేసు నమోదు చేశారు. భూ వివాదం ఇంకా కొనసాగుతూనే ఉండగా ఇప్పుడు మరో భూవివాదంలో మల్లారెడ్డిపై కేసు నమోదు చేయడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకుంది.

## 'కాళేశ్వరం'పై కొనసాగుతున్న జస్టిస్ పీసీ ఘోష్ విచారణ



తెలంగాణవీణ, హైదరాబాద్


హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై జస్టిస్ పీసీ ఘోష్ విచారణ ప్రక్రియ కొనసాగుతోంది. ఈఎన్సీ జనరల్ కార్యాలయంలోని ఇంజినీర్లు, ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలోని ఇంజినీర్లు నేడు కమిషన్ ముందు హాజరయ్యారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి వారి పాత్ర, సంబంధిత అంశాలపై కమిషన్ విచారణ చేస్తోంది. అవసరమైన అంశాలపై సమాచారం, వివరాలు సేకరిస్తోంది. కొంత మంది ఇతర వ్యక్తుల నుంచి కూడా కమిషన్ సమాచారం తీసుకుంటోంది.

## 'మోదీ' తాడాసనం!



అంతర్జాతీయ యోగా దినోత్సవం సమీపిస్తున్న సందర్భంగా ప్రధాని మోదీ 'తాడాసనం'పై ఓ వీడియోను విడుదల చేశారు. మోదీని పోలిన గ్రాఫిక్ ఇమేజ్ ఆ ఆసనం ఎలా వేయాలో చూపిస్తోంది. దానివల్ల కలిగే ప్రయోజనాలను చిత్రాల రూపంలో అందులో చూడొచ్చు. 'ఇది శరీరానికి ఎంతో మంచిది. శరీర భాగాల స్థితిని ఒక క్రమంలో ఉంచడంలో ఉపకరిస్తుంది' అని ప్రధాని గురువారం ఎక్స్‌లో విడుదల చేసిన ఆ వీడియోలో పేర్కొన్నారు. పదేళ్ల క్రితం జూన్ 21ని యోగా దినోత్సవంగా నిర్వహించాలని ఐరాసలో భారత్ ప్రతిపాదించింది. దానికి అన్ని దేశాలు ముక్తకంఠంతో ఆమోదం తెలిపాయి. దీంతో ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

## దొంగే.. దొంగా దొంగా అన్నట్లుగా వైకాపా తీరు



తెలంగాణవీణ, ఏపీ బ్యూరో

దొంగే.. దొంగా దొంగా అన్నట్లు ఉంది వైకాపా నేతల తీరు. ఎవరూ ఎవరినీ ఏమీ అనకముందే వారిని కొట్టారంటూ దిల్లీలో విజయసాయిరెడ్డి పెడబొబ్బలు పెడుతున్నారు. గతంలో వారు చేసినట్లు ఎన్డీయే పాలనలోనూ దాడులకు పాల్పడతారన్న భయంతో ఇలాంటి ప్రకటనలు చేస్తున్నార'ని ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు మండిపడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం పెదఅమిరంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'నేను ఎంపీగా ఉన్నప్పుడు తప్పుడు కేసు పెట్టి, పట్టపగలే ఇంట్లోంచి ఎత్తుకెళ్లి అర్ధరాత్రి వరకూ తిప్పుతూ కొట్టారు. దీనిపై ఆధారాలున్నా గత ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇలా ఎన్నో దుర్మారాలు చేసిన వారు.. నేడు ఏమీ జరగకముందే ఏదో జరిగిపోతోందన్న అపోహతో ముందుగానే తమని కొడుతున్నారని, చంపేస్తున్నారని పెడబొబ్బలు పెడుతున్నార'ని రఘురామ విమర్శించారు.